టీడీపీకి ప్రజా సమస్యలు పట్టవా?





చైర్మన్ పోడియాన్ని చుట్టుముట్టిన కౌన్సిలర్ ఫయాజ్‌బాషా తదితరులు, తాగునీటి సమస్యపై అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్

- టీడీపీ కౌన్సిలర్లను నిలదీసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన పాలక పక్షమైన టీడీపీ కౌన్సిలర్లకు ప్రజా సమస్యలు పట్టవా అని వైఎస్సార్‌సీపీ 2వ వార్డు కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌బాషా నిలదీశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాలులో ఇన్‌చార్జ్ కమిషనర్ బండి శేషన్న ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్ అధ్యక్షతన సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అయితే సమావేశానికి చైర్మన్ జేసీ.ప్రభాకర్‌రెడ్డి వచ్చినా తన చాంబర్‌కే పరిమితం కావడంతో వైస్ చైర్మన్ కౌన్సిల్‌కు అధ్యక్షత వహించారు. ముందుగా మున్సిపల్ మేనేజర్ చాంద్‌బాషా అంజెండాలోని అంశాలను చదివి వినిపిస్తుండగా జోక్యం చేసుకున్నటీడీపీ కౌన్సిలర్లు దినసరి కూరగాయల సమీపంలోని మాసం మార్కెట్ విషయంలో ఇన్‌చార్జి కమిషనర్ బండి శేషన్న సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. దీంతో ఇన్‌చార్జి కమిషనర్ జోక్యం చేసుకుని అజెండాలోని అంశాలను చదివి వినిపించిన తర్వాత కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతానని ప్రకటించారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ కౌన్సిలర్లు చైర్మన్ పోడియం వద్దకు వెళ్లి తాము వాకౌట్ చేస్తున్నామని ఈ విషయాన్ని మినిట్స్ బుక్‌లో పొందుపర్చాలని పట్టుబట్టారు. జోక్యం చేసుకున్న వైఎస్సార్‌సీపీ 2వ వార్డు కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌బాషా అంజెండాలో లేని అంశాలపై చర్చకు పట్టుబట్టడమేంటని ప్రశ్నించారు. పట్టణంలో సమస్యలు తాండవిస్తున్నాయని, ముఖ్యంగా అండర్ డ్రైనేజీ సమస్య తీవ్ర రూపం దాల్చిందని అండర్ డ్రైనేజీ సమస్య పరిష్కారంపై చర్చించాల్సిన పాలకపక్షం సభ్యులు ఇలా ప్రజా సమస్యలను గాలికి వదిలేసి వాకౌట్ చేయడం సమంజసం కాదన్నారు. సభాపతి స్థానంలో ఉన్న వైస్ చైర్మన్ ఇందుకు వంతపాడడం ఎంటని ప్రశ్నించారు. కౌన్సిల్‌లో ఇరుపక్షాల వారికి సంధానకర్తగా వ్యవహరించాల్సిన వైస్ చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరించడం దారుణమని ఫయాజ్‌బాషా మండిపడ్డారు.

సమాధానం చెప్పలేక మోహం చాటేస్తున్న చైర్మన్

మున్సిపల్ చైర్మన్ జేసీ.ప్రభాకర్‌రెడ్డి కౌన్సిల్‌కు హాజరైతే ప్రజా సమస్యలపై ఎక్కడ సమాధానం చెప్పాల్సి వస్తుందోనన్న భయంతో కౌన్సిల్‌మీట్‌కు హాజరుకాకుండా మొహం చాటేస్తున్నారని కౌన్సిలర్ ఫయాజ్‌బాషా విమర్శించారు. కౌన్సిల్ మీట్ అనంతరం ఫయాజ్‌బాసా విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేకే టీడీపీ కౌన్సిలర్లు వాకౌట్ చేశారని విమర్శించారు.

తాగునీటి సమస్యపై అధికారుల నిలదీత

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ హాల్లో శుక్రవారం చైర్‌పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బిందె వరలక్ష్మి, కౌన్సిలర్లు ఖాజా ఖాన్, వరదరాజులు, రాజేశ్వరి, ఫరూక్, వాల్మీకి శివ, అంజలి తదితరులు తాగునీటి సమస్యపై అధికారులతో వాగ్వాదానికి దిగారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేస్తామని కమిషనర్ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. దీంతో వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'దిశ'తో మహిళలకు రక్షణ



మాట్లాడుతున్న డీఎస్పీ గంగయ్య

తాడిపత్రి అర్బన్: దిశ యాప్‌తోనే మహిళలకు రక్షణ అని డీఎస్పీ సిఎం.గంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం పుట్లూరు రోడ్డులోని రఘు ఫంక్షన్ హాలులో ఆర్డీటీ ఆధ్వర్యంలో దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ దిశా యాప్ ఆవశ్యకతను వివరించారు. ఆర్డీటీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

చురుగ్గా అండర్ డ్రైనేజీ మరమ్మతు



అండర్ డ్రైనేజీ మరమ్మతు చేస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని మహాత్మాగాంధీ సర్కిల్ వద్ద అండర్ డ్రైనేజీ మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. పట్టణంలోని పలు వీధుల్లో అండర్ డ్రైనేజీ సమస్య తలెత్తి మురుగు నీరు మ్యాన్‌హోల్స్ నుంచి బయటకు వచ్చి దుర్వాసనను వెదజల్లుతున్న విషయం తెలిసిందే. ఈవిషయాన్ని గమనించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి యుద్ధప్రాతిపదికన అండర్ డ్రైనేజీ మరమ్మతు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగి హుటాహుటిన మరమ్మతు పనులు ప్రారంభించారు. అయితే ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా వాహనాలను బైపాస్ రోడ్డు మీదుగా దారి మళ్లించారు. రెండు రోజుల్లో పనులు పూర్తి కానున్నట్లు అధికారులు తెలిపారు.

గురుకుల పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ భాస్కర్

బుక్కరాయసముద్రం: కొర్రపాడులోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, ఎంత మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారని ప్రిన్సిపాల్ విజయలక్ష్మితో అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కొర్రపాడు ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, సాకే లక్ష్మి నారాయణ, మందల శివ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సచివాలయంలో శనివారం తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచు పార్వతి కోరారు. శుక్రవారం సచివాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు ఎంపీడీఓ విజయ భాస్కర్, ఈఓఆర్డీ దామోదరమ్మ, సెక్రటరి సాధిక్ పాల్గొన్నారు.

రీసర్వే పరిశీలన

శింగనమల: ఆకులేడు పొలంలో జరుగుతున్న రీసర్వేను ఆర్డీఓ మధుసూదన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే పకడ్బందీగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రీసర్వేపై తహసీల్దార్ ఈశ్వరమ్మతో ఆరా తీశారు.

పేద విద్యార్థికి చేయూత

తాడిపత్రి: యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన మోక్షిత్ అనే విద్యార్థి చదువుకు జన్ సంకల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆనంద్ బాబు చేయూతన నిచ్చాడు. శుక్రవారం పట్టణంలో విద్యార్థి చదువుతున్న మౌర్య పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్ ఆంజనేయులుకు రూ. 42 వేల నగదు అందజేశారు.

నేటి నుంచి 25 వరకు 'జగనన్న సురక్ష' సర్వే

యాడికి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అలెగ్జాండర్, ఎంపీడీఓ లక్ష్మీ నారాయణ శుక్రవారం కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 16 సచివాలయాల్లో సదస్సుల నిర్వహణకు రెండు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. 1న చందన, లక్షుంపల్లె గ్రామ సచివాలయం, 4న కమలపాడు, గుడిపాడు, 11న నిట్టూరు, కోనుప్పలపాడు, 15న పుప్పాల, నగరూరు, 18న వేములపాడు, రాయలచెరువు-1లో, 21న యాడికి-1, రాయలచెరువు-2లో, 22న యాడికి-2, యాడికి-4లో, 25న యాడికి-3, యాడికి-5 గ్రామ సచివాలయాల్లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆయా తేదీల్లో సచివాలయాల సిబ్బంది, గ్రామ వలంటీర్లు అన్ని సర్వే రికార్డులతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

గుత్తి రూరల్: మండలంలోని 13 సచివాలయాలలో శనివారం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. 1న కొత్తపేట, 4న ఊబిచెర్ల, 6న కొజ్జేపల్లి, 11న వన్నేదొడ్డి, 13న కరిడికొండ, 15న తొండపాడు, 18న అబ్బేదొడ్డి, 20న జక్కలచెరువు, 22న పి.ఎర్రగుడి, 25న పెద్దొడ్డి, తురకపల్లి, 27న బసినేపల్లి, బేతాపల్లి సచివాలంయలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

యల్లనూరు: మండలంలోని నిట్టూరు సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందని మండల స్పెషలాఫీసరు ఫిరోజ్‌ఖాన్, తహసీల్దారు సుమతి, ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. కార్యక్రమానికి అందరూ హాజరుకావాలన్నారు.

రైళ్లు నిలిపేలా చూడాలని ఎంపీకి వినతి



ఎంపీ రంగయ్యకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యాడికి: రాయలచెరువు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేలా చూడాలని వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం అనంతపురంలో ఎంపీ తలారి రంగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాయలచెరువు రైల్వే స్టేషన్‌లో కరోనా సమయం నుంచి ముంబై- చెన్నై, కాచిగూడ, చెంగల్పపట్టు రైళ్లు ఆగడం లేదని, దీంతో యాడికి మండలంతో పాటు, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధర్మవరం-మచిలీపట్నం రైలును రాయలచెరువులో ఆపేలా చూడాలన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, నాయకులు నాగేష్, రషీద్, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించండి

గుంతకల్లుటౌన్: డ్రైనేజీలు నిండి రోడ్లపై మురుగునీరు పారుతున్న ఎందుకు పట్టించుకోరు? ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేయించాలని తెలియదా అంటూ శానిటేషన్ సిబ్బందిపై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని 29, 7, 8 వార్డుల్లో పర్యటించిన కమిషనర్ శానిటేషన్‌ను పరిశీలించారు. 7,8 వార్డుల్లో డ్రైనేజీలు నిండి రోడ్లపై మురుగునీరు పారుతుండటంతో శానిటేషన్ సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పారిశుధ్య కార్మికుల చేత డ్రైనేజీలను శుభ్రం చేయించారు. పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు తగు చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి సూచించారు. 29వ వార్డులో ఇంటింటా చెత్తసేకరణ సక్రమంగా జరగాలని శానిటేషన్ సెక్రటరీని ఆదేశించారు. అనంతరం కమిషనర్ 1వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేసి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై కార్యదర్శులతో చర్చించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి



డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న డీటీసీ

తాడిపత్రి అర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (డీటీసీ) వీర్రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తాడిపత్రి ప్రాంతీయ రవాణా కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎంవీఐ శ్రీనివాసులు, రాజగోపాల్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యాలయం ప్రాంగణంలోని డ్రైవింగ్ లైసెన్సు టెస్టును డీటీసీ పరిశీలించారు. ట్రాక్ సక్రమంగా లేకపోవడంతో కొత్తది నిర్మించాలని సూచించారు. అనంతరం మార్కెట్ యార్డులోని పర్ఫెక్ట్ హెవీ డ్రైవింగ్ స్కూల్‌ను ఆయన పరిశీలించారు. అభ్యర్థులతో శిక్షణపై ఆరా తీశారు. అనంతరం డీటీసీ వీర్రాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు జిల్లా సేఫ్ అథారిటీ ద్వారా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాన్స్‌పోర్టు వాహనాల యజమానులు బాడుగలు లేక నిలిపిస్తే వివరాలను రవాణాశాఖాధికారులకు తెలియజేయాలన్నారు. దీంతో పన్ను మినహాయింపు ఇచ్చే అవకాశముంటున్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

గార్లదిన్నె: ఉన్న ఆశా వర్కర్లు సాంకేతికంగా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ షమీన్ తాజ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ఈ ఆశా యాప్‌పై ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ షమీన్ తాజ్ మాట్లాడుతూ ఆశాయాప్‌లో గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు, అర్హత గల దంపతులు, నవజాత శిశువుల సేవలను 6 నెలల నుంచి 58 నెలల పిల్లలకు ఇచ్చే ఐరన్ ఫోలిక్ సిరప్, విటమిన్ ఏ ద్రావణం ఇచ్చే తేదీలను నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్లు గౌతమి, హసీనా, ఆశా నోడల్ అధికారి అరుణకుమారి పాల్గొన్నారు.

గుంతకల్లుకు రూ.4.53 కోట్ల పంటల బీమా



రైతుల జాబితాను ప్రదర్శిస్తున్న ఏఓ స్వాతి

గుంతకల్లు రూరల్: డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మండలానికి రూ.4.53 కోట్లు మంజూరు చేసినట్లు ఏఓ కే.స్వాతి తెలిపారు. శుక్రవారం స్థానిక మార్కెట్‌యార్డులోని ఆర్బీకేలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022 ఖరీఫ్ సీజన్‌కు గానూ వాతావరణ ఆధారిత పంటల బీమా జాబితాలో వేరుశనగ, చీని పంటలకు, దిగుబడి ఆధారిత పంటల జాబితాలో పత్తి పంటకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రకటించిందన్నారు. వేరుశనగకు ఎకరాకు రూ.1,800, చీనీ ఎకరాకు రూ.10,000, పత్తి ఎకరాకు రూ.889 ప్రకటించిందన్నారు. మండలంలోని అన్ని ఆర్బీకేల్లో ఇన్సూరెన్స్ పొందిన రైతుల జాబితాలను ఏర్పాటు చేశామని, ఇందులో ఏవైనా మార్పులు ఉంటే జూలై 4 లోపు ఆర్బీకేల్లో తెలియజేయాలని సూచించారు.

పెద్దవడుగూరు : మండలంలోని 1,303 మంది రైతులకు వాతావరణ బీమా మంజూరైనట్లు ఏఓ మల్లీశ్వరి శుక్రవారం తెలిపారు. చీనీ, బత్తాయి, దానిమ్మ, వేరుశనగ, టమాటా రైతులకు రూ.1,29,87,982 బీమా మంజూరైందన్నారు. పత్తి పంట సాగు చేసిన 1,959 మంది రైతులకు రూ.34,26,628 విడుదలైందన్నారు.

శింగనమల: ఖరీఫ్ 2022కు సంబంధించి మండలంలోని 3,036 మంది రైతులకు పంటల బీమా రూ.5,33,17,004 మంజూరైనట్లు ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. మండలంలో బత్తాయి, టమాట, పత్తి పంటలకు పంటల బీమా మంజూరైందన్నారు. ఆర్బీకేల్లో రైతుల జాబితా ఉంచామని, ఇందులో ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే జూలై 4 లోపు ఆర్బీకేల్లో తెలియజేయాలని సూచించారు.

బుక్కరాయసముద్రం: మండలంలోని 1,099 మంది చీని రైతులకు రూ.3.4 కోట్లు, 510 మంది పత్తి రైతులకు రూ.73.3 లక్షల బీమా మంజూరైనట్లు ఏఓ శ్యాంసుందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. జూలై 8న రైతుల ఖాతాల్లో జమ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

గార్లదిన్నె: మండలంలో గతేడాది ఖరీఫ్‌కు సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల భీమా పథకం కింద రూ.22 కోట్లు మంజూరైనట్లు ఏఓ సోమశేఖర్ తెలిపారు. వాతావరణ ఆధారిత బీమా కింద వేరుశనగ రైతులకు రూ.64 లక్షలు, చీనీ రైతులకు రూ.21.58 కోట్లు మంజూరయ్యాయన్నారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా అన్ని ఆర్బీకేల్లో డాక్టర్ వైఎస్సార్ పంటల భీమా జాబితా విడుదల చేసినట్లు ఏఓ కాత్యాయని తెలిపారు. మండల వ్యాప్తంగా 2,968 మంది రైతులకు రూ.6.17 కోట్లు బీమా మంజూరైందన్నారు.

శాకంబరిగా వాసవీ మాత



వాసవీ మాతను దర్శించుకుంటున్న భక్తులు

గుత్తి: పట్టణంలోని మెయిన్ బజారులో వెలిసిన వాసవీ కన్యకా పరమేశ్వరి నాలయంలో వాసవీ మాత శుక్రవారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి ఆధ్వర్యంలో వేద పండితులు వాసుదేవ శర్మ శుక్రవారం ఆషాడ శుద్ధ ద్వాదశిని పురష్కరించుకుని వాసవీ మాతను శాకబరిగా అలంకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్‌బాబు, మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు రాచమడుగు ఉమాదేవి, భాగ్యలక్ష్మి, కోశాధికారిణి ఆర్వేటి సుకన్య, యువజన సంఘం అధ్యక్షుడు తాయి వెంకటేశులు, సభ్యులు గోపాలకృష్ణ, వెంకట్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాండురంగస్వామి కల్యాణం

పామిడి: పట్టణంలోని పెద్దవిఠోబ దేవాలయంలో శుక్రవారం డబ్బేదార్ పిర్కా ఆధ్వర్యంలో రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం చేపట్టారు. రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో రుక్మిణీ పాండురంగస్వామి రుక్మిణీ పాండురంగస్వామి ఉత్సవ విగ్రహాలను హంసవాహనంలో ఊరేగించారు.

చాకిరేవు మొత్తాన్ని రాసిచ్చేశారు...!

- న్యాయం చేయాలని తహసీల్దార్‌కు రజకుల పిర్యాదు



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న ఎంపీటీసీ నాగార్జునరెడ్డి, రజకులు

పుట్లూరు: ఎన్నో ఏళ్లుగా రజకులకు జీవనాధారమైన చాకిరేవుతోపాటు ఖాళీ స్థలాన్ని సైతం వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన విషయంపై రజకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం సమీపంలోని చెరువు కటకట్ట వద్ద సర్వే నంబర్ 1207-ఏ2లో బట్టలను ఉతుకడానికి, ఆరబెట్టుకోవడానికి వినియోగించుకునేలా 1983లో 7.59 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. అయితే గత టీడీపీ ప్రభుత్వంలో ఓ మహిళ పేరుపై ఖాతా నంబర్ 2735 ద్వారా చాకిరేవుకు సంబంధించిన భూమిని పిత్రార్జితంగా నమోదు చేస్తూ పట్టాదారు పాసుపుస్తకాన్ని మంజూరు చేశారు. కాగా చాకిరేవు వద్ద కమ్యూనిటీ భవనాన్ని నిర్మించడానికి రికార్డులను పరిశీలించిన సమయంలో వెబ్‌ల్యాండ్‌లో ఇతరుల పేరుపై నమోదు అయిన విషయాన్ని గుర్తించారు. అక్రమంగా రజకులకు సంబంధించిన భూమిని వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయడంపై ఎంపీటీసీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ మోహన్‌కుమార్‌కు పిర్యాదు చేశారు. సమస్యను విన్న తహసీల్దార్ ఉన్నతాధికారుల నివేదిక పంపి వెబ్‌ల్యాండ్‌లో నమోదైన పేర్లను తొలగిస్తామని వారికి హామీ ఇచ్చారు.

నాణ్యమైన విద్యనందించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ పద్మప్రియ

యల్లనూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని డిప్యూటీ డీఈఓ పద్మప్రియ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం ఆమె యల్లనూరు జెడ్పీ హైస్కూల్ , కస్తూర్బా విద్యాలయం , వెన్నపూసపల్లి జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థలతో పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి జగనన్న విద్యాకానుక కిట్ అందించాలన్నారు. ఆయా పాఠశాలల్లో నాడు-నేడు పనులపై ఆరా తీశారు. ఆమె వెంట ఎంఈఓ-2 పరమేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

సామాజిక తనిఖీ గ్రామసభలు

పుట్లూరు: మండలంలోని రంగరాజుకుంట, అరకటివేముల గ్రామాల్లో శుక్రవారం సామాజిక తనిఖీపై గ్రామ సభలు నిర్వహించినట్లు ఏపీఓ చెన్నకేశవులు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై తనిఖీలు నిర్వహించిన సామాజిక తనిఖీ బృందం గ్రామ సభ నిర్వహించి వివరాలను వెల్లడించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: ఊటకల్లు గ్రామంలో ఓ వ్యక్తి శుక్రవారం ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శ్రీనివాసులు కొన్ని నెలలుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. పలు ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదు. తీవ్ర మనస్తాపం చెందిన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పెద్దవడుగూరు : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ నాగభూషణ, ఎంపీడీఓ కుళ్ళాయిస్వామి పేర్కొన్నారు. శుక్రవారం ముప్పాలగుత్తి గ్రామంలోని ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు కాలనీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. ఎస్ఐ శ్రీనివాసులు, ఈఓఆర్డీ నాగేశ్వరశాస్త్రి, ఆర్ఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంచారజాతుల మహిళా కార్యాలయం ప్రారంభం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పొట్టిశ్రీరాములు సర్కిల్ నందు ఏర్పాటు చేసిన ఏపీ సంచార జాతుల మహిళా సంఘం కార్యాలయాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఇందిరాదేవి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సంచార జాతుల మహిళలు అన్ని రంగాల్లో రాణించే దిశగా ప్రభుత్వాలు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పట్నం రాజేశ్వరి, నందిని, ఐద్వా పట్టణ కార్యదర్శి రంగమ్మ, డాక్టర్ హిమబిందు, నేతలు పాల్గొన్నారు.

సుపరిపాలన మోదీతోనే సాధ్యం

గుంతకల్లుటౌన్: భారత ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశ సుపరిపాలన సాధ్యమని బీజేపీ రాష్ట్ర చిరంజీవి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కిరణ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో మోదీ తొమ్మిదేళ్ల సుపరిపాలన, ఆయన అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను మార్కెట్‌లోని దుకాణదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాహితం కోసం పనిచేస్తున్న మోదీ సర్కారును ఆశీర్వదించాలని కోరారు. బీజేవైఎం పట్టణాధ్యక్షుడు కేశవ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిమి రామాంజినేయులు, నాయకులు శేఖన్న, పురంధర్, బండారు కృష్ణమూర్తి, వడ్డే రమేష్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

శింగనమల: సీ.బండమీదపల్లి వద్ద శుక్రవారం తాడిపత్రి- అనంతపురం రాహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఏఎస్ఐ చితంబరం తెలిపిన వివరాలు...సీ.బండమీదపల్లికి చెందిన ఆదెప్ప బైక్‌పై వెళ్తుండగా అనంతపురం వెళ్తున్న కారు బస్సును ఓవర్‌టేక్ చేయబోయి బైక్‌ను ఢీకొంది. ఘటనలో ఆదెప్పకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని అనంతపురం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

చేపల చెరువు వేలం

యల్లనూరు: మండల కేంద్రంలోని సచివాలయం -2లో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి గీత, మత్స్య శాఖ అధికారి పక్కీరప్ప, వైష్ణవి ఆధ్వర్యంలో చేపల చెరువు వేలం నిర్వహించారు. ఉప సర్పంచ్ సూర్యనారాయణ రూ.33 వేలకు వేలం దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. రెండు నెలల తర్వాత మళ్లీ చేపల చెరువు వేలం ఉంటుందన్నారు. సర్పంచ్ ఓబులమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వేలం విషయంపై ఎలాంటి సమాచారం తెలియజేయలేదని ప్రజలు చర్చించుకున్నారు.